




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఏప్రిల్ 10, 2026 | సంపుటి : 2 | సంచిక : 179 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం
- డిప్యూటి సిఎం భట్టి విక్రామర్క వెల్లడి

**ఖమ్మం,ఏప్రిల్9 :**
కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్దంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు.

మిగతాది 2లో

## పొంగులేటి కాదు.. పొంగులూటీ

- బాంబులు పేలుతాయన్న బాంబులేటి
- అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు
- క్రషర్‌లో జరిగిన అవినీతిని సిఎం స్వయంగా చెప్పారు
- నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే ..హైడ్రా ఎందుకు వెళ్లలేదు
- గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం



**వనపర్తి,ఏప్రిల్9 :**
పొంగులేటి కాదు ఆయన బాంబులేటి.. పొగరులేటి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో పొగరులేటి మాటలు.. నిజాలు దాచి అబద్దాలు మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాటలు వింటే.. ఆయన ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్ధమవుతోందని అన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇదివరకు బాంబులు పడతాయని చెప్పి ఏడాది దాటిందని.. అవి తుస్సుమన్నాయని సెటైర్లు గుప్పించారు. ఆయనలో సరుకు లేనందునే తిట్ల దండకం అందుకున్నారని ధ్వజమెత్తారు. పిట్ట కథలు.. తిట్లు.. ఆయన ఆయాసం.. అన్నీ చూశామని విమర్శించారు. ఆయనతో పాటు సహచర మంత్రుల అవినీతి చిట్టా కూడా చదివారని ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో హరీశ్‌రావు పర్యటించారు. గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, మల్లు భట్టి విక్రమార్క, సీఎం సోదరుల అవినీతి బాగోతాన్ని పొంగులేటినే బయట పెట్టారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన పొంగులేటి కాదు పొంగులూటీ అని వ్యగ్యంగా మాట్లాడారు. ఆయన క్రషర్‌లో జరిగిన అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డినే స్వయంగా బయటపెట్టారని ఆరోపించారు. ప్రతిపక్షం కాదని.. తామే అన్ని విషయాలు వెలుగులోకి తెస్తామని అసెంబ్లీలోనే సీఎం చెప్పారని అన్నారు. సీఎం ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు వెళ్లి.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అనుమతులు లేవని నివేదిక ఇచ్చారని ప్రస్తావించారు. మరి అధికారులు, సీఎం చెప్పింది తప్పా.. పొంగులేటి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు.. ఇదంతా మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమని ఆరోపించారు. తాము ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాతనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన కంటైనర్‌పై రంగు వేసి, కాంగ్రెస్ జెండా తీసేశారని ఆరోపించారు.

మిగతాది 2లో


2 లో

## తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలదే

మంత్రి సీతక్క వ్యాఖ్యలు

**మహబూబాబాద్,ఏప్రిల్9 :**
తల్లిదండ్రులను వృద్దాప్యంలో ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు.


2లో..

## రెచ్చిపోతున్న భూ కబ్జాదారులు

- పాఠశాల కాంపౌండ్ వాల్ కూల్చివేత దుర్మార్గం
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంపి రఘునందన్ వినతి

**సంగారెడ్డి,ఏప్రిల్9 :**
కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేస్తున్నారని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు.



## రేవంత్ కన్నా... కెసిఆర్ పాలనే బెటర్

- నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్
- తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది
- జాతీయ స్థాయిలో బిజెపి..రాష్ట్రంలో కెసిఆర్ బెటర్
- కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు
- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన

2లో..

**జగిత్యాల,ఏప్రిల్9 :**
రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు.

## అల్లం నుంచి పనీర్ వరకు అన్నీ కల్తీనే.. కఠిన చట్టాలు తేవాలి: అంజిరెడ్డి

**హైదరాబాద్:**
దేశంలోనే ఆహార కల్తీలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని భాజపా ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆరోపించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పెడతామని గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత సర్కార్ కూడా మాటలు చెప్పిందని విమర్శించారు.


2లో..

## ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం

- 21 నెల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం
- జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి
- విభజన కన్నా జగన్ వల్లనే ఎపి నష్టపోయింది
- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు
- బాపట్ల జిల్లా సూరేపల్లిలో పట్టా పుస్తకాలు అందచేత


2 లో

**బాపట్ల,ఏప్రిల్9 :**
ప్రజలకు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని..దానిని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.


2లో..

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

- రాజకీయాల్లో నిఖార్సయిన నేత
- జీవన్‌రెడ్డిని ప్రశంసించిన కెటిఆర్
- జగిత్యాలలో జీవన్‌తో భేటీ

**జగిత్యాల,ఏప్రిల్9 :**
ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్, జీవన్ రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పటి నుంచో ఉంది. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నాయన్నారు. 2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన

## జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

» గతంలో కెసిఆర్ పాలనను విమర్శించింది మరిస్తే ఎలా
» పొంగులేటిపై ఆరోపణలు కాదు..దమ్ముంటే చర్చకు రావాలి
» మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్


2 లో

**హైదరాబాద్,ఏప్రిల్9 :**
మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి గురించి అనేక సార్లు జీవన్ రెడ్డి విమర్శించారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. వాటిని మరచి ఇవాళ జీవన్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ఆయనకు ఇష్టం లేకపోతే చేసేదేమీ లేదని, కానీ విమర్శలకు కూడా ఓ హద్దు ఉండాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వస్తున్న ఆరోపణలపై మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు.



2 లో

## ఎమ్మెల్యే పల్లాను బురిడీ క ఒట్టించిన సైబర్ నేరగాడు

- కేంద్ర పథకం చెప్పి లక్ష రూపాయాలు లూటీ
- పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే

**జనగామ,ఏప్రిల్9 :**
ఇప్పటి వరకు అనేకమందిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఓ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు చెప్పాడు.

ఏప్రిల్ 23న సమ్మెకు వెళ్లే అవకాశం

## తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

**హైదరాబాద్:**
ఈ నెల 13 తర్వాత సమ్మెపై స్పష్టత ఇస్తామని తెలంగాణ ఆర్టీసీ జేఏసీ నేతలు తెలిపారు. 13న లేబర్ కమిషనర్, ఆర్టీసీ యాజమాన్యంతో చర్చిస్తామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చామని గుర్తుచేశారు. ఏప్రిల్ 23న సమ్మెకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొన్నారు.



# రేవంత్ కన్నా... కెసిఆర్ పాలనే బెటర్

మొదటిపేజీ తరువాయి
ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయయంగా మారింది. కాగా, కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనునున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన
అనుచరుల్లో ఒకరు దారుణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

## ఎమ్మెల్యే పల్లాను బురిడీ క ఒట్టించిన సైబర్ నేరగాడు

మొదటిపేజీ తరువాయి
దీనికిగాను ఒక్కొక్కరికి రూ.2500 చెల్లించాలని నమ్మబలికాడు. దీంతో తన నియోజకవర్గంలోని
యువతకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సదరు అపరిచిత వ్యక్తికి ఎమ్మెల్యే పల్లా.. రూ.లక్ష ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా? అని అడిగారు. డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పడంతోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని తెలిపారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా.. జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు.
ఈ రకంగా బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల బారిన పడటం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వయంగా ఒక ప్రజాప్రతినిధిని, అది కూడా ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు కేవలం సామాన్యులనే కాకుండా, అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఎమ్మెల్యే వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారే మోసపోయారంటే, సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవడమే దీనికి ఏకైక పరిష్కారమని పలువురు చెబుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్దిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈరోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ.లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నంబర్‌కు బదిలీ చేశారు.డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ నిందితులపై ఈ క్రింది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు, వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకానికి కూడా వ్యక్తిగత ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపాలని అధికారులు కోరారని అన్నారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి
21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఎన్నికల్లో చెప్పనివి కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని సీఎం విమర్శించారు.గురువారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో పర్యటించిన సీఎం.. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేదన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయని.. దారిలో పెడుతున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ప్రజల భూములపై కన్నేశారని.. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని మండిపడ్డారు. 'పట్టా పుస్తకంపై జగన్ ఫొటో వేసుకున్నారు.. ఆస్తి మీది.. ఫొటో ఆయనది' అని విమర్శించారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతిపోయిందని సీఎం అన్నారు. నూటికి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతినెలా 9న ఒక ప్రాంతంలో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని.. జులై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి కోటి 12లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని
వెల్లడించారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రికార్డులు మారుస్తున్నామని చెప్పారు. రైతులకు ఇస్తున్న పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరన్నారు. కరెన్సీకి వాడే టెక్నాలజీని పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. 22ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకొస్తామన్నారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు ఆదర్శం కాకూడదని సీఎం అన్నారు. సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూమి నుంచి వచ్చే ఆదాయమే కాకుండా.. సముద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేసిందని.. ప్రతి దానిపైనా అప్పులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోయిందన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను డెవలప్ చేశానని.. ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్నీ ఆలోచించే రాజధానికి అమరావతి పేరు పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రజా రాజధాని.. దేవతల రాజధాని.. అమరావతి' అని పేర్కొన్నారు. ఆనాడు బాబాయ్‌ని చంపి.. ఆ నేరం తనపై వేశారని సీఎం మండిపడ్డారు. అమరావతిపై జగన్ కక్షగట్టారని.. ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియోలు తీశారని, లాఠీలతో కొట్టించారని గుర్తుచేశారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచిందన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ఒక్కడే సైకో అనుకున్నామని.. వైసీపీ నేతలంతా సైకోలుగా మారారని వ్యాఖ్యానించారు. 'నీలాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదు' అని స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే విధ్వంసం చేశారని... ప్రతిపక్షంలో ఉంటే బెదిరిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేయాలనుకుంటే.. దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

## అల్లం నుంచి పనీర్ వరకు అన్నీ కల్తీనే.. కఠిన చట్టాలు తేవాలి: అంజిరెడ్డి

మొదటిపేజీ తరువాయి
500 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమిస్తామని చెప్పి మరిచారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే కల్తీ చేస్తున్నవారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.“ఫ్యూచర్ సిటీ.. కల్తీ లేని సిటీలుగా చేస్తామన్నారు. రైజింగ్ తెలంగాణ కాదు.. అనారోగ్య తెలంగాణ అవుతోంది. అల్లం నుంచి పనీర్ వరకూ అన్నీ కల్తీనే. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమించండి. కనీసం ప్రైవేట్ కంపెనీకి అయినా అప్పగించండి. కల్తీ విషయంలో కఠిన చట్టాలు తేవాలి. తమిళనాడులో 500 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశారు. అదే విధానం మన రాష్ట్రంలోనూ అమలు చేయాలి. కల్తీని అడ్డుకోకపోతే హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతినే ప్రమాదం ఉంది” అని అంజిరెడ్డి తెలిపారు.

## మధ్యాహ్న భోజన పథకం పరిశీలించిన ఎమ్మెల్యే

కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపుడి హై స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం పథకం అమలు విధానాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులతో కలిసి స్వయంగా క్యూలైన్‌లో నిలబడిన ఎమ్మెల్యే.. భోజనం పెట్టించుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు అందరూ పాఠశాలలోనే భోజనం చేసేలా నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుడు, విద్యా కమిటీ ఛైర్మన్ బాజీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం చేయని పలువురు విద్యార్థులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. పాఠశాలలో ఉన్న 540 మంది విద్యార్థులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ప్లేట్లను అందిస్తామన్నారు.

## ద్వారకా తిరుమల నకిలీ టికెట్ల స్కాం వ్యవహారం

- **ఏఈవో రమణరాజు కుమారుడు రాజు ప్రధాని నిందితుడు**
- **ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**

ద్వారకా తిరుమల నకిలీ టికెట్ల స్కాం వ్యవహారంలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రవణ్ కుమార్ వెల్లడించారు. ప్రధాన నిందితుడు రాజుతోపాటు మరో ఆరుగురు దేవస్థానం ఉద్యోగులను అరెస్ట్ చేశామని చెప్పారు. గురువారం ఏలూరులో డీఎస్పీ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. నిందితుల వద్ద నుంచి నకిలీ టికెట్ల ప్రింటింగ్‌కు ఉపయోగించిన ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది మార్చి రెండో వారంలో ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నకిలీ దర్శనం టికెట్ల విక్రయం బహిర్గతమైంది. ఆలయంలో స్కానింగ్ పాయింట్ వద్ద కొన్ని దర్శనం టికెట్లు స్కాన్ కాకపోవడంతో ఈ వ్యవహారం బట్టబయలు అయింది. ఈ వ్యవహారంలో దేవస్థానం ఏఈవో రమణరాజు కుమారుడు రాజు ప్రధాని నిందితుడు కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దేవాలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో సిబ్బంది తగు జాగ్రత్తలు పాటిస్తుంటారు. భక్తులు.. కౌంటర్‌లో టికెట్లు కొనుగోలు చేసి దేవాలయంలో ప్రవేశించి.. స్కానింగ్ పాయింట్ వద్ద భద్రతా సిబ్బందికి వాటిని ఇస్తారు. వారు ఈ టికెట్లను స్కాన్ చేసి భక్తులను దేవాలయంలోకి అనుమతిస్తారు. ఆలయంలో ఏఈవో కుమారుడు రాజు దేవాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.200 టికెట్లను అతడు టికెట్ కౌంటర్‌లో విక్రయించాడు. అవి ఆలయంలో స్కానింగ్ పాయింట్ల వద్ద స్కాన్ చేస్తే.. టికెట్లు స్కాన్ కావడం లేదు. దీంతో ఈ విషయాన్ని దేవస్థానం ఉన్నతాధికారుల దృష్టికి భద్రతా సిబ్బంది తీసుకెళ్లారు. వారు వెంటనే రంగంలోకి దిగి.. కౌంటర్‌లో జారీ చేసిన టికెట్లను పరిశీలించారు. అవి 61 టికెట్లు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ టికెట్లు జారీ చేసిన రాజును దేవస్థానం అధికారులు ప్రశ్నించారు. అనంతరం ఈ వ్యవహారంపై పోలీసులకు దేవస్థానం ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో ఈ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

## జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

మొదటిపేజీ తరువాయి
పొంగులేటి అవినీతిపై ఆధారాలు ఉంటే చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆధారాలు ఉంటే పట్టుకొని గాంధీ భవన్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే కుదరదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో అప్పటి మంత్రులు చాలా దోచుకున్నారని ఆరోపించారు. జేబులు నింపుకొని ఈరోజు తమ మంత్రులపై విమర్శలు చేస్తారా? అని ఆగ్రహించారు. ఆనాటి దోపిడీ గురించి కేసీఆర్ కూతురు కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ హయాంలో నాసిరకం ప్రాజెక్టులు కట్టి డబ్బులు దోచుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

## రెచ్చిపోతున్న భూ కబ్జాదారులు

మొదటిపేజీ తరువాయి
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కూడా ప్రభుత్వ భూములను కబ్జా చేశారని విమర్శించారు. వారి కబ్జాలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వారే కబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గురువారం పటాన్‌చెరు పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. సర్వే నంబర్ 428లో 2 ఎకరాల 18 గుంటల స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ ప్రజాసంక్షేమం కోసం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పుకొచ్చారు. కబ్జాదారులకు, జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాల తరగతి గదులను రాత్రికి రాత్రి కూలగొట్టడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల కాంపౌండ్ వాల్ బయటనే జాతీయ రహదారి విస్తరణ చేయాల్సి ఉండగా .. పాఠశాల తరగతి గదులను కూల్చివేయటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ఈ విషయమై స్పందించి పాఠశాల గదులను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల కూల్చివేతలపై అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

మొదటిపేజీ తరువాయి
ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి జగిత్యాల ప్రజల తరపున నేను మిమ్మల్ని ఒకటి అడగ దలచుకున్నా.. బోర్నపల్లి గ్రామానికి సంబంధించి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట చిన్నగా అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం. అని చెప్పొచ్చు. జీవన్ రెడ్డి మీదున్న గౌరవం, ప్రేమ ఎట్లాంటిదంటే.. కేసీఆర్ రూ.70 కోట్ల బ్రిడ్జిని అక్కడికక్కడే మంజూరు చేసి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి మంజూరు చేసిన బ్రిడ్జిని ఇచ్చారన్నారు.. 2014 ఎన్నికల ముందు కేసీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి నిబద్ధత గల నాయకుడు.. కాంగ్రెస్‌లోనే కొనసాగారు. అసెంబ్లీలో ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల చాలా గట్టిగా మాట్లాడే నాయకుడు. జగిత్యాల జిల్లాలో నిజాం షుగర్స్ చాలా ముఖ్యమైనదని.. దాన్ని ఖచ్చితంగా తెరిపించాల్సిందేనని విద్యాసాగర్ రావు, జీవన్ రెడ్డి ఇద్దరూ కొట్లాడేవారు. షుగర్ ఫ్యాక్టరీని ఖచ్చితంగా తెరిపించాల్సిందే.. మేం కూడా మాటిస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలో సహకార వ్యవస్థలో అక్కడి షుగర్ మిల్లులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నయ్. టెస్కాబ్ చైర్మన్, మాజీ అధ్యక్షుడు రవిందర్ రావు కూడా ఇక్కడే ఉన్నరు. అట్లా కో ఆపరేటివ్ వ్యవస్థను బాగు చేస్తే బాగుంటది జీవన్ రెడ్డి గారు ఒకవేళ మీకు కావాలనుకుంటే ప్రభుత్వం నుంచి రూ.250 నుంచి 300 కోట్లు పెట్టేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నామని.. అవసరమైత మీరే దానికి చైర్మన్‌గా ఉండండి.. అని చెప్పి నిండు శాసనసభలో కేసీఆర్ ఆనాడు జీవన్ రెడ్డిగారికి ఎలాంటి భేషజానికి పోకుండా ఓపెన్‌గా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. అంతకుముందు జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది.

## పొంగులేటి కాదు.. పొంగులూటీ

మొదటిపేజీ తరువాయి
కేసీఆర్ హయాంలో నాదర్‌గుల్ భూములను 22 ఏ లో పెట్టి రక్షించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ భూములను ఎందుకు దాస్తున్నారని.. వీటి గురించి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇవి ప్రభుత్వ భూములని ఆర్డీఓ కోర్టులో చెప్పారని.. మరి ఎందుకు అక్కడి భూమిలో రోజుకోక కొత్త బోర్డు వెలుస్తోందని నిలదీశారు. ఇవి ప్రభుత్వ భూములు అయితే ఆక్రమణదారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అడిగారు. రెవెన్యూ మంత్రిగా పొంగులేటి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రా పంపించి, కాంపౌండ్ వాల్ కూలగొట్టి, ఆక్రమణలను కూల్చి రేవంత్‌రెడ్డి సర్కార్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాంబులు తుస్సుమన్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మా మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని మా అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో సీఎం చెప్పారు. అనుమతులు లేకుండా నడుపుతున్నారని రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారు. అంటే సీఎం చెప్పింది తప్పా.. మంత్రి పొంగులేటి చెప్పింది తప్పా.. అదేంటో తెలియాలన్నారు. నాలుగు శాఖల అధికారులు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. నీ కంపెనీకి మైన్ లేదని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదు. సీఎం తప్పు చెప్పారని మంత్రి పొంగులేటి ఎందుకు చెప్పలేదు. నువ్వు పొంగులేటి కాదు.. పొంగులూటీ అని దుయ్యబట్టారు. రెండున్నరేళ్లుగా ఎందుకు భూమిని స్వాధీనం చేసుకోలేదు. ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తుంది. పేదల ఇళ్లపైకేనా హైడ్రా వెళ్తుందని హరీశ్ రావు ప్రశ్నించారు.

## తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలదే

మొదటిపేజీ తరువాయి
అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందించే పౌష్టికాహార పంపిణీని కచ్చితంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫోన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్దిదారుల వివరాలు, ఆహార పంపిణీ వివరాలు నమోదు చేసి పారదర్శకత పెంచుతామని చెప్పుకొచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.ఌ

# హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని ఎమ్మెల్యే వినతి

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 9**





హుజూరాబాద్: పట్టణంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల హుజూరాబాద్ మండలం, పట్టణ ప్రజలతో పాటు సమీపంలోని సైదాపూర్, కేశాపట్నం, మానకొండూర్, భీమదేవరపల్లి మండలాల ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. చెత్త నిల్వ కారణంగా గాలి, నీరు, భూమి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.ప్రత్యేకంగా రైతులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని, వ్యవసాయ భూములు కాలుష్యానికి గురై పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రజల ఆరోగ్యం, రైతుల భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్ రవీందర్ రావు, రాజపల్లి సర్పంచ్ మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆర్.కే. రమేష్, ఉప సర్పంచ్ సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ కీ: శే :పొనగంటి సారంగం తనయుడు అభిరామ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 9**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ పరిధి 7వ వార్డు మాజీ కౌన్సిలర్ దివంగత కీ.శే. పొనగంటి సారంగం తనయుడు అభిరామ్ పుట్టినరోజు సందర్భంగా పొనగంటి రవికుమార్ (పీజేఆర్) ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య జరిపారు.పుట్టినరోజు వేడుకల సందర్భంగా అభిరామ్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి సహాయ సహకారాలు అందజేశారు. ఈ కార్యక్రమం సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్, పొనగంటి సందీప్, పొనగంటి ప్రశాంత్, శీలం అశోక్, సంద మహేందర్, రాధ రవి, రాధా రాంబాబు, బోనగిరి రాజేందర్, గై శ్రీనివాస్, పొనగంటి సతీష్, సిరియాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అభిరామ్ మంచి భవిష్యత్తు సాధించాలని, సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. దివంగత పొనగంటి సారంగం సేవలను స్మరించుకుంటూ, ఆయన కుటుంబం ప్రజలతో ఉన్న అనుబంధం ఎప్పటికీ నిలిచిపోతుందని పేర్కొన్నారు.

# పుల్లవేణి కొమురయ్య దశదినకర్మ కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 9**





జమ్మికుంట పట్టణంలోని 10వ వార్డుకు చెందిన పుల్లవేణి పోచమల్లు పెద్ద అన్న అయిన కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. ఆయన మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా పరిసర ప్రాంత ప్రజలకు కూడా తీరని లోటుగా నిలిచింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి బంధుమిత్రులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన నాయకులు, ఆయన సేవలను స్మరించుకున్నారు. గ్రామంలో, పరిసర ప్రాంతాల్లో కొమురయ్య సాధించిన గౌరవం, ప్రజలతో కలిసిమెలిసి ఉండే స్వభావం గురించి గుర్తుచేసుకుంటూ ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కొమురయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి కూడా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ఓదార్పు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తూర్పాటి చందన శంకర్, పొనగంటి రాము, పొనగంటి సంపత్, బండ శ్రీనివాస్, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణ రావు, పొనగంటి మల్లయ్య, గాజుల భాస్కర్ తదితరులు పాల్గొని కొమురయ్యకు ఘనంగా నివాళులు అర్పించారు.

# మండల అధ్యక్షులు పసునూటి అన్వేష్ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ యు ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఏప్రిల్ 9**





కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు పసునూటి అన్వేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం మండలంలో ఎన్ఎస్‌యూఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు పసునూటి అన్వేష్ మాట్లాడుతూ విద్యార్థి నాయకులు, యువజనులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున విద్యార్థులు యువకులుఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి, కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తూ ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమ ప్రాంగణం మొత్తం నినాదాలతో మార్మోగింది.ఈ సందర్భంగా మాట్లాడిన పసునూటి అన్వేష్, 1971లో దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాం నాయకత్వంలో ఎన్ఎస్‌యూఐ స్థాపించబడిందని గుర్తు చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా పనిచేసే విద్యార్థి సంఘమని, దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తోందని తెలిపారు.విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే వేదికగా ఎన్ఎస్‌యూఐ నిలుస్తోందని, ఇందులో పనిచేసే ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ, సేవా భావం అలవడతాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విలువలకు ప్రాధాన్యత ఇచ్చే నాయకులను తయారు చేస్తుందని వివరించారు.ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఎన్ఎస్‌యూఐ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కులు, అవకాశాల కోసం నిరంతరం కృషి చేయడం తమ లక్ష్యమని తెలిపారు.అలాగే ఎన్ఎస్‌యూఐ ద్వారా ఎదిగిన పలువురు నాయకులను ఉదాహరణగా పేర్కొన్నారు. మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎదగడం, కరీంనగర్‌కు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థి దశలోనే పోరాటాలు చేయడం, డాక్టర్ బల్మూర్ వెంకట్ రెండు సార్ల రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు.వీరందరినీ ఆదర్శంగా తీసుకుని రాబోయే రోజుల్లో కూడా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పసునూటి అన్వేష్ తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా హక్కుల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి సందీప్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వలసని సుమన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారపెల్లి వంశీ, విద్యార్థి నాయకులు సామ అరుణ్, రమేష్, అజయ్, శివ తదితరులు పాల్గొన్నారు

# దామోదర్ రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణకు హాజరైన వొడితల ప్రణవ్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 9**

- దామోదర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం
- హుజూరాబాద్ నియోజకవర్గంలో విగ్రహం ఏర్పాటు చేస్తాం
- కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దిన మహానేత






హుజూరాబాద్, పాత కమలాపూర్ నుంచి భారీగా తరలివచ్చిన అభిమానులు "జోహార్ దామన్న" నినాదాలతో మారుమ్రోగిన సభ కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో ప్రజల అవసరాల కోసం అహర్నిశలు కృషి చేసి "జిల్లా టైగర్"గా పేరు తెచ్చుకున్న మహానేత ముద్దసాని దామోదర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం కరీంనగర్ పట్టణ శివారులోని సదాశివపల్లిలో ఆయన 14వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ, ముద్దసాని దామోదర్ రెడ్డి పేరు జిల్లాలో తెలియని వారు లేరని, ఆయన నమ్మకం, విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచారని తెలిపారు. తమ కుటుంబానికి, ముఖ్యంగా తమ తాత వొడితల రాజేశ్వర్ రావుకు ఆయనతో ఎంతో సన్నిహిత సంబంధం ఉందని గుర్తుచేశారు. దామోదర్ రెడ్డి ఆశయాలు, విలువలు యువతరం నాయకులకు మార్గదర్శకమని, వాటిని అనుసరిస్తూ ప్రజా సేవలో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.విగ్రహ ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లానే కాదు రాష్ట్ర స్థాయిలో కూడా దామోదర్ రెడ్డికి విశేషమైన అభిమాన వర్గం ఉందని చెప్పారు. ఆయన తరవాత ఆ ప్రాంతానికి నాయకత్వం వహించే అవకాశాన్ని యువ నాయకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కరీంనగర్ మేయర్ శ్రీనివాస్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దామోదర్ రెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేశారు.

# రైల్వే లైన్ విస్తరణ, అభివృద్ధి పనులు వేగవంతం

**– భూ సేకరణ రోడ్డు విస్తరణ కు శ్రీకారం**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 9**







కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో రైల్వే లైన్ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. పట్టణంలో తరచుగా ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమైన లెవల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్‌లు (ఆర్‌ఓబీలు) నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్‌సీ–20 లెవల్ క్రాసింగ్ (జమ్మికుంట--మడిపల్లి క్రాస్ రోడ్) మరియు ఎల్‌సీ–25 లెవల్ క్రాసింగ్ (బిజిగిర్ షరీఫ్--పాపయ్యపల్లి గ్రామ క్రాస్ రోడ్) ప్రాంతాల్లో జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీ ద్వారా బ్రిడ్జ్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, సాంకేతిక అంశాలు, రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ మార్గాల మార్పులు వంటి అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు.ప్రస్తుతం ఈ లెవల్ క్రాసింగ్‌ల వద్ద రైళ్లు వెళ్లే సమయంలో గేట్లు మూసివేయడం వల్ల ప్రజలు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవలు పొందే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు రోడ్డు ఓవర్ బ్రిడ్జ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.ఇన్స్పెక్షన్ సందర్భంగా తహసిల్దార్ నల్ల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ వల్ల స్థానిక ప్రజలకు భారీగా లాభం చేకూరుతుందని చెప్పారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గిర్ధవార్లు సత్యనారాయణ, గడ్డం శంకర్, సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు మ్యకమల్ల తిరుమల వెంకటేష్, అమరగొండ నిర్మలా బాబు రావు, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, అలాగే రోడ్డు సెక్టార్‌కు చెందిన రైల్వే భూ సేకరణ నిపుణుడు పి. దేవరాజు తదితరులు ంగా, స్థానిక ప్రజలు కూడా ఈ ప్రాజెక్ట్‌పై సానుకూలంగా స్పందిస్తూ, త్వరగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. బ్రిడ్జ్‌లు నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రమాదాల అవకాశాలు కూడా తగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు.

ఈ రోడ్డు ఓవర్ బ్రిడ్జ్‌లు నిర్మాణం జమ్మికుంట పట్టణ అభివృద్ధికి మరో ముఖ్యమైన అడుగుగా భావించబడుతోంది. భవిష్యత్తులో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పట్టణ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కూడా ఇది దోహదం చేస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సూరేపల్లిలో ప్రభుత్వ స్టాళ్ల పరిశీలన

## రాజముద్రతో కూడా పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ

బాపట్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. గురువారం ఉదయం భట్టిప్రోలు మండలం సూరేపల్లి చేరుకున్న సీఎం... అక్కడ ఏర్పాటు చేసిన గ్రామసభకు హాజరయ్యారు. ప్రభుత్వ స్టాళ్లను సందర్శించారు. 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్య ప్రసాద్, పార్థసారథి, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు తదితరులు పాల్గొన్నారు. అమరావతి గెజిట్ వచ్చాక సీఎం మొదటి పర్యటనగా బాపట్లకు వచ్చారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటూ జగన్ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వేమూరు నియోజకవర్గం అభివృద్ధి చెందిందని.. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆగిన అభివృద్ధి ఇప్పుడు మళ్లీ పట్టాలెక్కిందన్నారు. సీఎం ఆలోచనల మేరకు ఉద్యాన పంటలు పెంచడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. మూత పడిన జంపని షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని.. ఈ ప్రాంతంలోని కాలువలు ఆధునీకరించాలని సీఎంను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు.

తాను లోక్‌సభ ప్యానెల్ స్పీకర్‌గా ఉన్నప్పుడు అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందిందని బాపట్ల ఎంపీ టి.కృష్ణ ప్రసాద్ అన్నారు. అన్ని పార్టీలు అమరావతి జై అంటే ఒక్క పార్టీ మాత్రమే వ్యతిరేకించిందని తెలిపారు. వైసీపీ అమరావతి బిల్లును వ్యతిరేకిస్తూ సభ నుంచి బాయ్‌కాట్ చేసిందని విమర్శించారు. జగన్ వల్ల రాష్ట్ర అభివృద్ధి పాతికేళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. చంద్రబాబు వల్లే మళ్లీ అమరావతి నిలబడిందని ఎంపీ తెలిపారు. జగన్ హయాంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో భూములు లాక్కున్నారని మండిపడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 'మీ భూమి – మీ హక్కు' పేరిట రక్షణ కల్పించిందని ఎంపీ కృష్ణప్రసాద్ వెల్లడించారు.

# న్యూరో ఎండోస్కోపీతో కొత్త జీవితం అందించిన మెడికవర్ హాస్పిటల్స్ హైదరాబాద్ వైద్యులు

- మెదడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన డాక్టర్ రమేష్ శిఘాకొల్లి



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 9**
10 సార్లు సర్జరీలు విఫలమైనా పట్టు వదలని వైద్య బృందం ఏళ్ల తరబడి మెదడు సమస్యతో బాధపడుతూ, పదే పదే శస్త్రచికిత్సలు చేయించుకున్నా ఉపశమనం పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కరీంనగర్‌కు చెందిన ఒక మధ్యవయస్కుడికి అత్యాధునిక న్యూరో ఎండోస్కోపిక్ చికిత్స ద్వారా కొత్త జీవితం లభించింది. దాదాపు 10 సార్లు శస్త్రచికిత్సలు విఫలమైన తర్వాత కూడా పట్టు వదలని వైద్యులు, మెదడులోని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం విశేషం.కరీంనగర్ జిల్లాకు చెందిన వ్యక్తి కొంతకాలంగా తీవ్రమైన తలనొప్పి, అతిగా నిద్రపోవడం, రోజువారీ పనులు చేసుకోలేకపోవడం, అలసట, అసహనం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. పలు ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించగా, ఆయనకు హైడ్రోసెఫాలస్ అనే మెదడు సంబంధిత సమస్య ఉన్నట్లు నిర్ధారించారు. మెదడులో సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్ (జూఫీ) అధికంగా పేరుకుపోయి, మెదడుపై ఒత్తిడి పెరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది.ఈ సమస్యను నియంత్రించడానికి గతంలో రోగికి అనేకసార్లు షంట్ సర్జరీలు నిర్వహించారు. సాధారణంగా షంట్ ద్వారా మెదడులో పేరుకుపోయిన ద్రవాన్ని శరీరంలోని ఇతర భాగాలకు మళ్లిస్తారు. అయితే ఈ రోగి విషయంలో షంట్ పదే పదే బ్లాక్ అవడం, ఇన్ఫెక్షన్లు రావడం, మళ్లీ మళ్లీ సర్జరీలు అవసరం కావడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. పదే పదే ఆపరేషన్లు చేయించుకోవడంతో రోగి మరియు కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.చివరి ప్రయత్నంగా ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రమేష్ శిఘాకొల్లిని సంప్రదించారు. రోగి పూర్తి వైద్య చరిత్ర, పాత శస్త్రచికిత్సల వివరాలు, స్కానింగ్ రిపోర్టులను పరిశీలించిన అనంతరం డాక్టర్ రమేష్ బృందం అత్యాధునిక న్యూరో ఎండోస్కోపీ విధానాన్ని ఉపయోగించి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది.ఈ విధానంలో ఎటువంటి బయటి ట్యూబులు లేదా షంట్లు ఉపయోగించకుండా, మెదడులో పేరుకుపోయిన ద్రవం సహజంగా ప్రవహించేలా ఒక కొత్త మార్గాన్ని సృష్టించారు. చిన్న రంధ్రం ద్వారా ఎండోస్కోప్ సహాయంతో నిర్వహించే ఈ మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ అత్యంత క్లిష్టమైనదైనా, వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడింది. గత నాలుగు నెలలుగా ఎటువంటి సమస్యలు లేకుండా ఆయన సాధారణ జీవితం గడుపుతున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ శిఘాకొల్లి మాట్లాడుతూ, హైడ్రోసెఫాలస్ వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదనీ ,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడం వల్ల రోగులు ఆలస్యంగా వస్తుంటారనీ, చాలామంది షంట్ సర్జరీలపైనే ఆధారపడుతుంటారు. కానీ ఇప్పుడు న్యూరో ఎండోస్కోపీ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా బయటి పరికరాలు లేకుండానే శాశ్వత పరిష్కారం అందించవచ్చు. పదే పదే సర్జరీలు చేయించుకుని ఆశ కోల్పోయిన ఈ రోగి తిరిగి ఆరోగ్యంగా మారడం మాకు ఎంతో ఆనందంగా ఉంది, అని తెలిపారు.పదే పదే శస్త్రచికిత్సలు చేయించుకుని ఆశలు కోల్పోయిన ఒక కుటుంబానికి ఈ చికిత్స కొత్త వెలుగును నింపింది. నరాల సంబంధిత లక్షణాలను ముందుగానే గుర్తించి, నిపుణులైన వైద్యులను సంప్రదిస్తే ఇలాంటి సంక్లిష్ట సమస్యల నుండి త్వరగా బయటపడవచ్చని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

# దివంగత దామోదర్ రెడ్డి కి నివాళులు అర్పించిన జమ్మికుంట నాయకులు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 9**
కరీంనగర్‌లో మాజీ మంత్రి, దివంగత ప్రజానాయకుడు స్వర్గీయ ముద్దసాని దామోదర్ రెడ్డి గారి 14వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత ఘనంగా, భావోద్వేగభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై ఆయనకు నివాళులు అర్పించారు.
ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొనగంటి మల్లయ్య, జమ్మికుంట పట్టణ 11వ వార్డు కౌన్సిలర్ పొంగంటి విష్ణువర్ధన్, ఏబీసీ ఓదెలు, పాతకాల ప్రవీణ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వీరితో పాటు అనేక మంది స్థానిక ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
ముందుగా నాయకులు కలిసి దామోదర్ రెడ్డి గారి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాల మౌనం పాటించి తమ గౌరవాన్ని చాటుకున్నారు.







ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు ముద్దసాని దామోదర్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ ఆయన రాజకీయ జీవితం ప్రజాసేవకే అంకితమైందని పేర్కొన్నారు. ఆయన ఒక దూరదృష్టి కలిగిన నాయకుడిగా, పేద ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన మహానుభావుడిగా కొనియాడారు. కరీంనగర్ ప్రాంత అభివృద్ధిలో ఆయన పాత్ర అపారమని, ముఖ్యంగా గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల ఏర్పాటులో ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరవలేనివని అన్నారు.
పొనగంటి మల్లయ్య మాట్లాడుతూ దామోదర్ రెడ్డి తన జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేశారని, ఆయన మార్గంలో నడవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. పొంగంటి విష్ణువర్ధన్ మాట్లాడుతూ యువత ఆయన ఆదర్శాలను తీసుకుని సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు, కార్యకర్తలు దామోదర్ రెడ్డి తో తమ అనుబంధాలను గుర్తుచేసుకుంటూ ఆయనతో గడిపిన క్షణాలను స్మరించుకున్నారు. ఆయన సరళత, సేవా భావం, నాయకత్వ లక్షణాలు తమకు ప్రేరణగా నిలిచాయని తెలిపారు.
ఈ కార్యక్రమం సందర్భంగా భారీగా హాజరైన ప్రజలు "దామోదర్ రెడ్డి అమరుడు" అంటూ నినాదాలు చేస్తూ ప్రాంతమంతా మారుమోగించారు. కార్యక్రమ ప్రాంగణం నినాదాలతో, జెండాలతో సందడి చేసింది. అంతేకాకుండా, కార్యక్రమాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. పేదలకు అన్నదానం, నీటి పంపిణీ, వృద్ధులకు సహాయం వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆయన సేవా స్ఫూర్తిని కొనసాగించారు.

# రెండవ రోజు కొనసాగినఆర్టిసన్ కార్మికులు, అనుమ్యాన్ కార్మికుల సమ్మె




**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 9**
తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ పిలుపు మేరకు ఈ రోజు అనగా 09-04-2026న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డివిజన్ కార్యాలయాల ముందు సమ్మె కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా హుజురాబాద్ డివిజన్ కార్యాలయం ఎదుట రెండో రోజు సమ్మెను కార్మికులు ఉత్సాహంగా నిర్వహించారు.
ఈ సమ్మెలో ఆర్టిసన్ కార్మికులు, అనుమ్యాన్ కార్మికులు, ఎస్పీఎం వర్కర్లు, పీసురేటు కార్మికులు భారీగా పాల్గొన్నారు. కార్మికులు తమ సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.
కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవి:
ఆర్టిసన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ (స్రూరాజుదీ) నిబంధనలు అమలు చేయాలి.
అనుమ్యాన్ కార్మికులను ఆర్టిసన్‌లుగా గుర్తించాలి.
పీసురేటు కార్మికులకు జి.ఓ. 11 ప్రకారం కనీస వేతనం చెల్లించాలి.
విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం కల్పించాలి.
ఈ కార్యక్రమంలో ఆర్టిసన్ కార్మికులు పంజాల శ్రీనివాస్, ఉప్పల్ రవి, అనుమ్యాన్ కార్మికులు వెంకటేష్, శివ, రవి, శ్రవణ్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తాము గత 15-20 సంవత్సరాలుగా ఈ సంస్థలో పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమని తెలిపారు. విధుల్లో ఉండగానే విద్యుత్ షాక్‌లకు గురై పలువురు సహచరులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను గుర్తుచేశారు.
అందువల్ల ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో హుజురాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్లకు చెందిన ఆర్టిసన్, అనుమ్యాన్, ఎస్పీఎం, పీసురేటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఐక్యతను ప్రదర్శించారు.

# రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలం: తెలంగాణ రైతు సంఘం ఆగ్రహం

**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్, ఏప్రిల్ 9:**
హుజూరాబాద్ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 6 గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజల మద్దతు పొందిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా నిరాశపరిచిందన్నారు. ముఖ్యంగా రైతులకు ఎకరానికి రూ.15,000 రైతు భరోసా ఇస్తామని, ప్రతి పంటకు రూ.7,500 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చినా, ప్రస్తుతం కేవలం ఎకరానికి రూ.6,000 మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వం ఏర్పడి రెండున్నర



సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఇవ్వవలసిన ఐదు పంటల రైతు భరోసా నిధుల్లో కేవలం రెండు పంటలకే చెల్లింపులు జరిగాయని, మూడో పంటకు కూడా రైతుల భూమి పరిమాణాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఒకే విధంగా రూ.6,000 చెల్లించడం అన్యాయమన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న మొత్తం నిధులను ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కౌలు రైతులకు రైతు భరోసా అందిస్తామని, భూమిలేని నిరుపేదలకు రూ.6,000 ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రైతుల సమస్యల పట్ల ప్రభుత్వం అసలు స్పందించడంలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.రాబోయే రోజుల్లో రైతులను పెద్ద ఎత్తున సమీకరించి, జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. రైతుల హక్కుల కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఓరుగంటి రమేష్ యాదవ్, కోడిమల వెంకటేష్, ఇమ్మడి దేవేందర్, మిడిదొడ్డి జనార్ధన్, కనకం అంజయ్య, పొడిసేటి ప్రభు శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ కార్మికులతో సమావేశమైన మున్సిపల్ చైర్మన్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్ 9:**




జమ్మికుంట పట్టణ పరిధిలోని కొత్తపల్లి, రామన్నపల్లి, ధర్మారం ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులతో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గురువారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.చైర్మన్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడు తనకు కేటాయించిన వార్డులో సమయపాలనతో పనులు నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు పట్టణ పరిశుభ్రతకు ఎంతో ముఖ్యమని, అందువల్ల బాధ్యతగా పనిచేయాలని కోరారు. అలాగే వార్డు ప్రజలతో మర్యాదగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ప్రస్తుతం ఎండాకాలం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విధులు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమయానికి తాగునీరు, నిమ్మరసం వంటి ద్రవాలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. "మీ ఆరోగ్యం మీ కుటుంబానికి ఎంతో కీలకం. మీరే మీ కుటుంబాలకు ఆధారం కావడంతో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి" అని చైర్మన్ తెలిపారు.లాగే పనిలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో అంబేద్కర్ జయంతి వేడుకలకు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయాలి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్ 9:**




పట్టణంలో ప్రతి సంవత్సరం నిర్వహించే డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ జన సమితి (టి.జె.ఎస్) పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అరికిల్ల భానుచందర్, మహిళా విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా అంబేద్కర్ జయంతి వేడుకలు సరైన ఉత్సవ కమిటీ లేకుండా నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అపారమని, అలాంటి మహనీయుని జయంతిని గౌరవప్రదంగా, ఘనంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ ఏడాది అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలో విభిన్న కార్యక్రమాలను సమగ్రంగా నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ రెవెన్యూ ఇన్స్పెక్టర్

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), ఏప్రిల్ 9:**



పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసిల్దార్ కార్యాలయంలో రూ. 10 వేలు లంచం తీసుకుంటూ రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీమాన్ గురువారం పట్టుబడ్డాడు. రాయదండి గ్రామానికి చెందిన వెంకటస్వామి అనే రైతు భూమి ఫీల్డ్ ఎంక్వైరీ విషయంలో సదరు రెవెన్యూ అధికారి డబ్బులు డిమాండ్ చేయడంతో రైతు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. కరీంనగర్ ఏసీబీ డిఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏసీబీ సీఐలు తిరుపతి, పున్నం చందర్, ప్రేమ్ కుమార్ రెడ్ హ్యాండెడ్ గా అంతర్గా రెవెన్యూ ఇన్స్పెక్టర్ను పట్టుకున్నారు. ప్రస్తుతం ఏసీబీ డిఎస్పి విజయ్ కుమార్ నేతృత్వంలో విచారణ కొనసాగుతోంది. గతంలో కూడా అంతర్గాం తహసిల్దార్ కార్యాలయంలో అవినీతి అధికారులను ఏసీబీ అధికారులు పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. వరుసగా రెవెన్యూ అధికారులు అవినీతి ఆరోపణలతో పట్టుబడటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

# ఎన్టిపిసి రామగుండంలో స్వచ్ఛతా అభియాన్

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), ఏప్రిల్ 9:**



ఎన్టీపీసీ హెచ్ఓడీ మనోజ్ కుమార్ ఝా మార్గదర్శకత్వంలో రామగుండం ఆపరేషన్ విభాగం పిటిఎస్ లోని ఎకో పార్క్ సమీపంలోని ఆరోగ్య పాత్ వద్ద స్వచ్ఛతా అభియాన్ కమ్ యోగాభ్యాస్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ గ్రూప్స్ 1, 2 అధికారులు పాల్గొన్నారు. ఎన్టీపీసీ సి.కె.సమంత, జిఎం మనీష్ అగర్వాల్ పాల్గొని అధికారులను మరింత ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టౌన్‌షిప్‌ను పరిశుభ్రంగా, చెత్త రహితంగా ఉంచాలని తెలిపారు. పరిశుభ్రతను రోజువారీ అలవాటుగా అలవర్చుకోవాలని ఉద్యోగులను ప్రోత్సహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా.. ఉద్యోగులు పరిశుభ్రతా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. అనంతరం యువ ఇంజనీర్ల చురుకైన భాగస్వామ్యంతో శారీరక దృఢత్వం, శ్రేయస్సును ప్రోత్సహిస్తూ తేలికపాటి యోగా, వ్యాయామం చేశారు. ఈ కార్యక్రమం పరిశుభ్రతను శ్రేయస్సుతో విజయవంతంగా అనుసంధానించి, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాలపై అవగాహన కల్పించింది.